

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 23-12-2025 | సంపుటి - 26 | సంచిక -215 | రూ : 4 | పేజీలు: 8



2లో

## 'బ్లూబర్డ్ బ్లాక్-2' ప్రయోగం ముంగిట

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

- కీలక ప్రయోగానికి ముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్
- డిసెంబర్ 24న LVM3-M6 రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం
- అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్న ఇస్రో
- సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా 4G/5G సేవలు అందించడమే లక్ష్యం

# హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది..

## ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

- ముగిసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది
- హైదరాబాద్ పర్యటన ముగించుకుని సోమవారం ఢిల్లీకి తిరుగుపయనం
- హకీంపేట ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి
- పర్యటనలో భాగంగా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి

2లో



## ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం

- మీనాగట్ట అడవుల్లో ఆయుధ తయారీ కేంద్రం
- ధ్వంసం చేసిన భద్రతా దళాలు
- భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం



2లో



## తెలంగాణను.. వణికిస్తున్న చలి..

- పలుచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు!
- తెలంగాణను కమ్మేసిన తీవ్రమైన చలిగాలులు
- సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 5 డిగ్రీల ఉష్ణోగ్రత
- 17 జిల్లాల్లో 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఏడు జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ

2లో

## తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంలో కీలక మార్పు

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు
- ఈ నిర్ణయం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం
- డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్ష భేటీలో ఈ నిర్ణయం



2లో

## రేపు సీఎం చంద్రబాబు 'క్వాంటం టాక్'..

50 వేల మంది టెక్ విద్యార్థులను ఉద్దేశించి కీలక ప్రసంగం

- రేపు టెక్ విద్యార్థులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- క్వాంటం ప్రోగ్రామ్‌కు 50 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్లు
- నమోదు చేసుకున్నవారిలో 51 శాతం మంది అమ్మాయిలే!
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్‌లో ఇంటర్న్‌షిప్
- అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

2లో




## అమరావతిలో కల్చరల్ సెంటర్...

### సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం

- అమరావతిలో కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- జోన్-8 ఎల్పీఎస్ లేఅవుట్ అభివృద్ధికి రూ.1358 కోట్ల కేటాయింపు
- క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని సూచన
- వివిధ అభివృద్ధి పనులకు 56వ సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం
- రాజధాని రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

2లో



# హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది... ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్: హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

## తెలంగాణలో అక్రిడిటేషన్లపై జీవో విడుదల

* **తెలంగాణలో అక్రిడిటేషన్లపై జీవో విడుదల**

హైదరాబాద్, డిసెంబర్ 22: తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇచ్చే మీడియా అక్రిడిటేషన్ కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ, 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025'ను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 252 ను సోమవారం చీఫ్ సెక్రటరీ కే. రామకృష్ణారావు జారీ చేశారు.

**కొత్త నిబంధనల ముఖ్యాంశాలు:**

1. అక్రిడిటేషన్ కమిటీల కాలపరిమితి: రాష్ట్ర స్థాయి,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాతవే కొనసాగుతాయని తెలిపారు.
2. అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు:
   * అక్రిడిటేషన్ కార్డు: ఇది ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా ఉపయోగపడుతుంది.
   * మీడియా కార్డు: డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే ఈ కార్డులు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందేందుకు మాత్రమే పనికివస్తాయి.
3. డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు:
   * డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రిడిటేషన్ ఇవ్వాలంటే సదరు వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది విజిటర్స్ (యూనిక్ విజిటర్స్) ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తారు.
4. ఎలిజిబిలిటీ క్రైటీరియా:
   * న్యూస్ పేపర్లు: కనీసం 2 వేల ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రిడిటేషన్‌కు అర్హులు. PRGI రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
   * ఎలక్ట్రానిక్ మీడియా: శాటిలైట్ ఛానళ్లు 50% వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.
   * జర్నలిస్టుల అర్హత: స్టేట్ లెవల్ అక్రిడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి.
   * నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.

**5. ఫ్రీలాన్స్ & వెటరన్ జర్నలిస్టులు:**

* 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**కమిటీల నిర్మాణం:**

* రాష్ట్ర కమిటీ : మీడియా అకాడమీ చైర్మన్ చైర్మన్‌గా, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ కో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, పీసీఐ సభ్యులు ఉంటారు.
* జిల్లా కమిటీ : జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఆర్వో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

* **నిబంధనల ఉల్లంఘన జరిగితే:**

* అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని జీవో విడుదల చేశారు.

# రేపు సీఎం చంద్రబాబు 'క్వాంటం టాక్'..

అమరావతి: క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'క్వాంటం టాక్' పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (డిసెంబరు 23) ఉదయం 9:30 గంటలకు టెక్ విద్యార్థులను ఉద్దేశించి డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు. క్వాంటం ఐటీ కంపెనీలైన క్యూబిట్, వైసర్‌లతో కలిసి ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ క్వాంటం ప్రోగ్రామ్ కోసం కేవలం 10 రోజుల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 51 శాతం మంది మహిళా విద్యార్థులే ఉండటం విశేషం. అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు ఏపీలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 3 వేల మందికి ఉన్నత స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. వీరి నుంచి ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఎస్ఐఆర్, సీడాక్, నేషనల్ క్వాంటం మిషన్‌లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తారు. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, రాబోయే మూడేళ్లలో ఏపీ నుంచి లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్, ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, వైసర్ డైరెక్టర్ ప్రాచీ వఖారియా వంటి ప్రముఖులు పాల్గొననున్నారు.

## అమరావతిలో కల్చరల్ సెంటర్... సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం

అమరావతి: రాజధాని అమరావతిలో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఒక ఆధునిక కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీని కోసం వెంటనే అనువైన భూమిని గుర్తించాలని సూచించారు. నేడు సచివాలయంలో జరిగిన 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి, పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి పనులపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అమరావతిలో ఒక వేదిక ఉండాలి. రాష్ట్ర సంస్కృతికి అద్దంపట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మాణం చేపట్టాలి. నిర్దేశిత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలి. భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. వారి సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలి," అని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలోని అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.

* **56వ సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన అంశాలు**

• అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ 2 ఎకరాల పరిధిలో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్

• అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపు.

• శాఖమూరు గ్రామంలో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం.

• హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో 6 ఎకరాలు కేటాయింపు.

• 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు.

• ఎల్పీఎస్ జోన్ 8లో లేఅవుట్ల అభివృద్ధికి రూ.1358 కోట్లు కేటాయింపు.

• 202 ఎకరాల భూమి జరీబు లేదా మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు. వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, రెవెన్యూ, సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం



ఒడిశా ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు దాచిపెట్టిన భారీ ఆయుధ సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన జవాన్లు, మీనాగట్ట అడవుల్లో భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలను మరియు ఆయుధాలను వెలికితీశారు. సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనితో రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని, ప్రదేశంలో మావోయిస్టులు నిల్వ చేసిన భారీ ఆయుధ గిడ్డంగిని గుర్తించారు. ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు ఉన్నాయి. వీటితో పాటు మావోయిస్టులకు సంబంధించిన యూనిఫామ్‌లు, కిట్ బ్యాగులు మరియు విప్లవ సాహిత్యాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు లభించడంతో ఆ ప్రాంతంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. మావోయిస్టులు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుడు పదార్థాలను అమర్చాలని భావించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నామని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

## 'బ్లూబర్డ్ బ్లాక్-2' ప్రయోగం ముంగిట తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

తిరుమల: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టే ప్రతి కీలక ప్రయోగానికి ముందు దైవ దర్శనం చేసుకోవడం దశాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయం. ఈ ఆనవాయతీని కొనసాగిస్తూ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు, లాంచ్ టీమ్ సభ్యులతో కలిసి ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. డిసెంబర్ 24న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చేపట్టనున్న LVM3M6 మిషన్ విజయవంతం కావాలని కోరుతూ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వాణిజ్య ప్రయోగంలో భాగంగా, ఇస్రో తన హెవీలిఫ్ట్ లాంచ్ వెహికల్ LVM3 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన 'ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్' సంస్థ అభివృద్ధి చేసిన 'బ్లూబర్డ్ బ్లాక్2' ఉపగ్రహాన్ని లో ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనుంది. ఈ శాటిలైట్ ప్రయోగం ముఖ్య ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ప్రత్యేక హార్డ్‌వేర్ అవసరం లేకుండా నేరుగా సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకే హైస్పీడ్ సెల్యులార్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడం. దీని ద్వారా 4G/5G వాయిస్, మెసేజింగ్, స్ట్రీమింగ్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి. షార్‌లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు.

## తెలంగాణను వణికిస్తున్న చలి...
# పలుచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లెలో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 8.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో 8.7, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 9.5, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (IMD) ఏడు జిల్లాలకు కోల్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో సహా 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం వేళ పొగమంచు కురిసే అవకాశం ఉందని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28, 13 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది.

## తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంలో కీలక మార్పు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. నిన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్ష భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని స్వాగతిస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ వెల్లడించింది. ఇక, మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ అమాంతం పెరిగింది. ఉచిత బస్సు సౌకర్యం కోసం మహిళలు పోటెత్తుతుండడంతో జీరో టికెట్ జారీ చేసే సమయంలో కండక్టర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు జేఏసీ తెలిపింది. ఈ విషయాన్ని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాల దృష్టికి జేఏసీ తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే మే 6న రవాణా శాఖ మంత్రితో జరిగిన సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావన రావడం, దానికి మంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని పేర్కొంది. ఇక, నిన్న డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్షా సమావేశంలో మహిళలకు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది.

# 29 నుంచి అసెంబ్లీ!



కృష్ణా, గోదావరి జలాలపై చర్చించేందుకు ఈ నెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టులపై చేసిన వ్యయం ఇలా అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులందరితో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. మొదట పంచాయతీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించారంటూ మంత్రులను సీఎం అభినందించారు. పంచాయతీ ఫలితాల గురించి చర్చించిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులు, కృష్ణా గోదావరి బేసిన్లలో పరిస్థితి, తాజాగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల గురించి మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడిన అంశాలపై వివరంగా చర్చించినట్లు తెలిసింది. వచ్చే ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని.. ఓటర్ల జాబితాలో సవరణల అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని అనుకున్నట్లు సమాచారం.

**70-80 డివిజన్లతో..**

గ్రేటర్ హైదరాబాద్ విస్తరణ, డివిజన్ల పెంపు, వాటిపై వస్తున్న ఫిర్యాదులపైనా మంత్రులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారని పార్టీ వర్గాలు చెప్పాయి. విస్తరణ పూర్తయిన తరవాత మొత్తం నగరాన్ని మూడు నగరపాలక సంస్థలుగా విభజిస్తే ఎలా ఉంటుందని ఆరాతీసినట్లు తెలిసింది. ప్రస్తుతమున్న జీహెచ్ఎంసీ పరిధిని అలాగే ఉంచి, కొత్తగా ఏర్పడిన డివిజన్లతో మరో రెండు నగరపాలక సంస్థలు ఏర్పడవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సైబరాబాద్ పేరుతో వీటిలో ఒకటి ఉండవచ్చని తెలుస్తోంది. కొత్తగా 7080 డివిజన్లతో ఒక్కో నగరపాలక సంస్థను ఏర్పాటుచేసి.. ఆ తరవాత వందకు పెంచాలనే ప్రతిపాదనలపైనా మాట్లాడినట్లు సమాచారం.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుడ్యానికి దోహదం

*** నందానగర్ వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ కార్తీక్ గౌడ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయని నందానగర్ వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ కార్తీక్ గౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో నందనగర్ లోని యువకులు 66 మంది 6 టీములుగా ఏర్పడి బోస్ లెజెండ్స్ టీం, లేజీ లెవెన్ టీం, నందనగర్ వారియర్స్ , క్రేజీ 11 బాయ్స్ టీం, నందనగర్ స్పార్టెన్స్ టీం, నందానగర్ ఫియర్లెస్ ఫ్లయర్స్ టీం ఈ ఆరు టీములకు టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్ లో ప్రథమ బహుమతి డీజిల్ 11 టీం కెప్టెన్ లక్ష్మణ్ అండ్ టీం మొదటి స్థానం కైవసం చేసుకోగా వారికి 5000 రూపాయలు నగదు బహుమానం అందజేశారు. , రెండవ స్థానంలో నందానగర్ వారియర్స్ కెప్టెన్ శివ యాదవ్ అండ్ టీం రన్నర్స్ కైవసం చేసుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించినటువంటి కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ కి , స్నేహితులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పెద్దలు మాజీ అధ్యక్షులు హరిబాబు , వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేష్ గౌడ్, చౌక తల్లి రవి కిరణ్ రెడ్డి , సాయి గౌడ్, లక్ష్మణ్, అజయ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు అంతేకాకుండా యువకులందరినీ ఒకచోట చూడడం చాలా సంతోషకరమని తెలియజేశారు. ఇలాగే అన్ని విషయాల్లోనూ ఐక్యంగా ఉంటూ ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని యువకులకు సందేశం ఇచ్చారు

# ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

*** గాజుల రామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గాజుల రామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అన్నారు.సోమవారం చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్ లో స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ మిషన్,స్వచ్ఛ సర్వేక్షన్ అవగాహన సదస్సు ర్యాలీ ని ఆయన స్థానిక బస్తి వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ మెయిన్ రోడ్డు నుండి వారితో కలిసి పాదయాత్ర చేశారు. కాలనీలో ప్రతి వీధిలో లో చెత్త వెయ్యకుండా ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని,రోడ్డుకు ముందర భాగంలో కొత్తగా ఇల్లు నిర్మాణాలు జరుగుతున్నాయని పలు విషయాలు ఉపకమిషనర్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ స్థానికులు చెప్పిన పలు ఫిర్యాదులపై కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. చెత్త బండిలో చెత్త వేయని వారిపై రుసుము వేసే విధంగా జీహెచ్ఎంసీ సిబ్బందితో త్వరలో వీధివీధి కి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి చెత్త బండి లో వేసే విధంగా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పచిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రతాపరెడ్డి, మాజీ అధ్యక్షులు కొండల శ్రీనాథ్ రావు, స్థానిక బస్తీ వాసులు వెంకట్ రెడ్డి, భీసు వెంకటేశం గౌడ్, మిక్సర్ రాములు, ఈశ్వర్, శ్రీధర్ గౌడ్, మల్లేష్, ప్రభాకర్, వెంకటేష్ గౌడ్, కృష్ణారెడ్డి, నాగరాజు, ఋషి, నరేందర్ గౌడ్ ,కుమార్, సూపర్వైజర్లు రామకృష్ణ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఏరు రివర్ ఫెస్టివల్ ఉత్సవాలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, జిల్లాలోని సహజ వనరులు, అటవీ సంపద ఆధారంగా పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో ఫారెస్ట్ వాక్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని ఫారెస్ట్ వాక్‌ను ప్రారంభించారు. అటవీ ప్రాంతాల గుండా సాగిన ఈ వాక్ యువతకు ప్రకృతితో నేరుగా మమేకమయ్యే అవకాశం కల్పించిందని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి ప్రశాంతంగా సమయం గడపడానికి అనువైన మంచి పిక్నిక్ స్పాట్‌గా, అలాగే పర్యటించడానికి అద్భుతమైన సహజ ప్రదేశమని తెలిపారు. అడవులు, కొండలు, సెలయేర్లు, సహజ వృక్ష సంపద కలగలిసి ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో జిల్లాకు ప్రధాన పర్యాటక కేంద్రంగా ఎదిగే అన్ని అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ఇలాంటి సహజ సుందర ప్రాంతాలను యువత పెద్ద సంఖ్యలో సందర్శించి, వాటి విశిష్టతను సమాజంలోని ఇతరులకు తెలియజేస్తూ పర్యాటకంగా అభివృద్ధి చెందే విధంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ఫారెస్ట్ వాక్ సందర్భంగా పాల్గొన్న యువత అడవిలోని సహజ అందాలు, సెలయేర్లు, వెదురు గుంపులు, వివిధ రకాల పండ్లు, ఔషధ మొక్కలు, వృక్షజాలం, జీవ వైవిధ్యానికి సంబంధించిన అంశాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో అడవుల పాత్ర ఎంత కీలకమో ఈ వాక్ ద్వారా అవగాహన కలిగిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాల్గొన్న యువత హస్తల వీరన్న స్వామి దర్శనం చేసుకొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని ముగించారు. ప్రకృతి, ఆధ్యాత్మికత రెండూ కలిసిన ఈ కార్యక్రమం యువతకు ప్రత్యేక అనుభూతిని కలిగించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రకృతిని కాపాడుకుంటూ అభివృద్ధి సాధించడమే లక్ష్యమని, ఇందుకు యువత భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్సిసి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ పేట సర్పంచ్ గా బక్కతట్ల రాధిక శ్రీశైలం ప్రమాణ స్వీకారం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట పాలకవర్గం ప్రమాణ స్వీకారం మండల వ్యవసాయ శాఖ అధికారి, గ్రామ ప్రత్యేకాధికారి ముత్యాల నాగరాజు సోమవారం చేయించారు. గ్రామ సర్పంచ్ గా బక్కతట్ల రాధిక శ్రీశైలం యాదవ్, ఉప సర్పంచ్ గా మొత్తం రమేష్ యాదవ్ లతో పాటు వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో కాంగ్రెస్ బలపరచగా గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ లను సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కనమేని చక్రధర్ రెడ్డిలు హాజరై కాంగ్రెస్ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ లకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొర్రాపూర్ , గన్నేవారిపల్లెకు చెందిన సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి ఈ సందర్భంగా పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని వివరించారు. తదనంతరం విద్యార్థులకు పలు పోటీలు చేపట్టి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# ధర్మోజి గూడెం సర్పంచ్ గా జువ్వి నరసింహ ప్రమాణ స్వీకారం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం సర్పంచ్ గా జువ్వి నరసింహ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓ అంజిరెడ్డి సర్పంచ్ తో పాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప సర్పంచ్ గా ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, 1వ వార్డు సభ్యుడు ఊదరి శ్రీనివాస్, 2వ వార్డు సభ్యురాలు సామిడి సంధ్య నాగరాజు రెడ్డి, 3వ వార్డు సభ్యురాలు ఐతరాజు శారద లింగస్వామి, 4వ వార్డు సభ్యుడు రాచకొండ భార్గవ్, 5వ వార్డు సభ్యురాలు జీడిముడ్ల శోభ కొండల్, 6వ వార్డు సభ్యుడు గునుగంటి వెంకటేష్, 7వ వార్డు సభ్యురాలు జంగం వెంకటమ్మ అంజయ్యలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నరసింహ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమన్నారు. గ్రామంలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానన్నారు. పాలకవర్గంతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచ్ లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొలువు దీరిన గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గాలు

# కాజీరామారం గ్రామ సర్పంచిగా సల్వాది సైదులు ప్రమాణ స్వీకారం..



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు కొలువుదీరారు. సోమవారం ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నూతన పాలక వర్గాల ప్రమాణ స్వీకార మత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఖాజీరామారం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా సల్వాది సైదులు , ఉపసర్పంచ్ సుంకరి సుమలత మోహన్ రావు , వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సర్పంచ్ సల్వాది సైదులు మాట్లాడుతూ రాజీరామారం గ్రామపంచాయతీని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. తాను నాయకుడిని కాదని, ప్రజా సేవకుడినని అన్నారు. పట్టణంలో ఉన్న 8వార్డ్ లను ప్రతి రోజు ఒక వార్డ్ ను నిరంతరం తిరుగుతూ వార్డ్ లో సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. నూతన వార్డ్ సభ్యులు రాజకీయ పార్టీలు ఏదైనా అయి ఉండొచ్చు కానీ ఊరు అభివృద్ధి అందరు ఎజెండాగా పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజేశ్వరి, గౌడ సంఘం గౌడ హాస్టల్ చైర్మన్ సుంకర వెంకటేశ్వర్లు, టిఆర్ఎస్ నాయకులు , సుంకరి శ్రీనివాస్, దండంపల్లి సైదులు, పాలకూర దశరథ, పెరపకా జగన్, బోలేదు రమేష్ తదితరులున్నారు.

# కొలువు దీరిన గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గాలు




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు కొలువుదీరారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నూతన పాలక వర్గాల ప్రమాణ స్వీకార మత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ తాళ్ళ విజయ్ రెడ్డి, వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సర్పంచ్ మట్టం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. తాను నాయకుడిని కాదని, ప్రజా సేవకుడినని అన్నారు.పట్టణంలో ఉన్న 14 వార్డ్ లను ప్రతి రోజు ఒక వార్డ్ ను నిరంతరం తిరుగుతూ వార్డ్ లో సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని అన్నారు.నూతన వార్డ్ సభ్యులు రాజకీయ పార్టీలు ఏదైనా అయి ఉండొచ్చు కానీ ఊరు అభివృద్ధి అందరు ఎజెండాగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ స్పెషల్ ఆఫీసర్ తహశీల్దార్ రామచంద్ర, పంచాయతీ సెక్రటరీ రమేష్ తదితరులున్నారు.

# బాధ్యతలు చేపట్టిన కన్ సాన్ పల్లి పాలకవర్గం

*** సర్పంచుగా తెనుగు సునీత, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణం...**



అందోలు, ప్రజాస్ఫూర్తి :స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా గా గెలుపొందిన అభ్యర్థులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రామ ప్రత్యేక అధికారి బి. కృష్ణ నూతనంగా ఎన్నికైన సర్పంచుచే, పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. సర్పంచ్ గా తెలుగు సునీత మైపాల్, ఉప సర్పంచ్ గా పిల్లోడి పెంటయ్య, వార్డు సభ్యులుగా దేవునూరి లక్ష్మి సదానందం,కలపల్లి లక్ష్మి ప్రభు, తెనుగు మహిపాల్, వని మోహన్, తలారి బాలకృష్ణ, వని రమాదేవి దుర్గేష్, ఎన్ మాధవరెడ్డి, శివ చందర్, మల్లమ్మ లు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామ ప్రత్యేక అధికారి శాలువాతో సర్పంచ్ తో పాటు పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం మాట్లాడుతూ నాపై నమ్మకంతో గెలిపించిన గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తామని, గ్రామస్తుల సహకారంతో అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామన్నారు. పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకటరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, నాయకులు ఎం. కృష్ణ, రమేష్ గౌడ్, సురేష్ రావు, మాజీ ఎంపిటిసి బాలయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరేశం, ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్, వెంకయ్య, బాల్ రాజ్, ఈశ్వరయ్య, ఆంజనేయులు, సత్తయ్య, శ్రీనివాస్, మణికంఠ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజా వలన పర్యావరణానికి తీవ్ర నష్టం

* **ఏసిపి పింగళి నరేష్ రెడ్డి**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : చైనా మాంజా వలన పర్యావరణానికి తీవ్ర నష్టం కలగడమే కాకుండా, మనుషులకు, ముఖ్యంగా పిల్లలకు ప్రాణాపాయం కలిగే అవకాశముందని ఏసిపి బాలానగర్ డివిజన్ పింగళి నరేష్ రెడ్డి అన్నారు. ప్రమాదకరమైన చైనా మాంజా విక్రయాలపై పోలీసులు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి బాలానగర్ డివిజన్ పింగళి నరేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతల్ ఏరియాలోని పలు దుకాణాలను పోలీసులు తనిఖీ చేయగా, నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న షాపులను గుర్తించి వాటిని స్వాధీనం (సీజ్) చేసుకున్నారు. పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఏసిపి పింగళి నరేష్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి మాంజాను తీసుకువచ్చి అనవసరంగా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొవద్దు" అని దుకాణదారులను హెచ్చరించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎస్సైలు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. చైనా మాంజా విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు..

# అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కృషి, పట్టుదల అవసరం

* **వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కృషి, పట్టుదల అవసరమని వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత దిగ్గజం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం విద్యార్థులు గణిత ప్రాజెక్టులను తయారుచేసి మాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు సందర్శించి ఇటువంటి అవకాశం కల్పించినందుకు వాళ్ళు ఎంతో సంతోషం వ్యక్తపరిచారు. అనంతరం నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టివిఆర్ మోడల్ స్కూల్లో ఘనంగా మాథ్స్ ఎగ్జిబిషన్



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : నేషనల్ గణిత దినోత్సవం పురస్కరించుకొని అపురూప కాలనీలో టివిఆర్ మోడల్ స్కూల్లో రామానుజన్ పుట్టినరోజు ఎంతో వైభవంగా జరిగింది ఈ సందర్భంగా పిల్లలకు రామానుజన్ , గణితం మెలికలు ఆధారంగా పరీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఎంతో మంది విద్యార్థులు గణిత ప్రాజెక్టులను తయారుచేసి మాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. దాదాపుగా 100 పైగా మ్యాథ్స్ ప్రాజెక్టు లతో ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగింది విద్యార్థులు తల్లిదండ్రులు సందర్శించి ఇటువంటి అవకాశం కల్పించినందుకు వాళ్ళు ఎంతో సంతోషం వ్యక్తపరిచారు ప్రాజెక్ట్ లో పాల్గొన విద్యార్థులు కూడా ఈ అవకాశం దొరకడం వల్ల చాలా సంతోషం భావించారు ఇందులో నైపుణ్యం చూపించిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీవీఆర్ కు అకాడమీ డైరెక్టర్ టి. వంశీ రెడ్డి గణిత ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ఉదయ్ , తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు




# సజ్జ రవి హత్య కేసులో 9 మంది అరెస్ట్

* **మరొక నిందితుడి కోసం గాలింపు కొనసాగింపు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:(భద్రాచలం) : ఈ నెల 17వ తేదీ బుధవారం సాయంత్రం భద్రాచలం-చర్ల రోడ్డులోని తిరుమల వైన్స్ షాప్ సమీపంలో జరిగిన సజ్జ రవి హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితులైన పంగి శివ, బోయిన దుర్గా ప్రసాద్, జలకం నాగరాజులతో పాటు మరో ఆరుగురిని ఆదివారం భద్రాచలం సీఐ నాగరాజు అరెస్ట్ చేసినట్లు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా ఒక నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని ఏఎస్పీ వెల్లడించారు.

**పట్టుబడిన నిందితుల వివరాలు:**
రాజుపేట కాలనీ కి చెందిన పంగి శివ (24), అదే ప్రాంతానికి చెందిన బోయిన దుర్గా ప్రసాద్ (24) , ఏఎస్ఆర్ కాలనీ కి చెందిన జలకం నాగరాజు (24), ఏఎస్ఆర్ కాలనీకి చెందిన బొడ్డు అఖిల్ ( అఖిల్ రాజ్ )(21) , ఏఎస్ఆర్ కాలనీకి చెందిన లంకపల్లి వెంకటేష్ (24) , భద్రాచలం , టెంపుల్ రోడ్ కు చెందిన ముత్యాల జయరాం (23) , రాజుపేట కాలనీ కి చెందిన రిక్క వీర శివ శంకర్ రెడ్డి ,రిక్క శివ (గుండు శివ) (25) , ఎంపీ కాలనీ కి చెందిన కాపుల శివ ( శివ ప్రసాద్) (35) , ఎంపీ కాలనీ కి చెందిన కాపుల కృష్ణ (24) లను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.




# మొదటిసారీ దేవునూరి ఫ్యామిలీకి దక్కిన పదవి

* **నలుబై ఏళ్ల తరువాత గ్రామ పరిపాలనలో రాజకీయ ప్రాతినిధ్యం..**
* **ప్రమాణ స్వీకరణలో పాల్గొన్న అభిమానులు, కుటుంబ సభ్యులు..**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ఆ ఊరి లో ఆ కుటుంబ ఫ్యామిలీ నేపథ్యం పెద్దది కానీ 40 ఏళ్ల గ్రామీణ పరిపాలనలో రాజకీయ ప్రాతినిత్యం మాత్రం ఆ కుటుంబ సభ్యులలో ఒక్కరికి కూడా దక్కలేదు. సుమారు 45 ఏళ్ల తర్వాత ఆ కుటుంబం నుండి ఓ మహిళ రాజకీయ రంగ ప్రవేశం చేసి వార్డు సభ్యురాలుగా ఎన్నిక కావడంతో మొదటిసారిగా గ్రామ పరిపాలన ప్రాతినిత్యం దక్కినట్లయింది. వివరాల్లోకెళ్తే ఆందోల్ మండలం కన్ సాన్ పల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల 4వ వార్డు లో సుమారుగా 200 ఓటర్లు ఉండగా వీరిలో సుమారుగా సగం ఓట్లు దేవునూరి ఫ్యామిలీకి చెందిన ఓటర్లే ఉన్నారు. కానీ ఏనాడు వీరికి రాజకీయ ప్రాధాన్యం దక్కలేదు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి ప్యానెల్ లో భాగంగా 4వ వార్డు అభ్యర్థిగా దేవునూరి లక్ష్మీ సదానందం నిలబడి విజయం సాధించడంతో ఆ ఫ్యామిలీ కి మొదటిసారి ప్రజా పాలన ప్రాతినిధ్యం దక్కినట్లయింది. సోమవారం వార్డు సభ్యురాలుగా ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆ ఫ్యామిలీ కుటుంబ సభ్యులతోపాటు అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించి సేవ చేసేందుకు అవకాశం కల్పించిన వార్డు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ, గ్రామ సర్పంచ్, పెద్దల సహకారంతో నాలుగో వార్డులో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. అన్నివేళలా వాడు సభ్యులకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.



# బూర్గంపాడు లో భారీ మాక్ డ్రిల్ నిర్వహణ

* **విపత్తుల సమయంలో సమర్ధవంతమైన స్పందనకు మాక్ డ్రిల్ విజయవంతం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందనకు మాక్ డ్రిల్ విజయవంతమైందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బూర్గంపాడు మండల కేంద్రంలో సోమవారం విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందన కోసం విస్తృతస్థాయి మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా పాల్గొని, ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఈఓసి) ద్వారా అన్ని శాఖల చర్యలను పర్యవేక్షించారు.మాక్ డ్రిల్‌ను ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో, అబ్జర్వర్‌గా ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ సుఖేందర్ దత్ పర్యవేక్షణలో నిర్వహించబడింది. క్షేత్ర స్థాయిలో ఈ మాక్ డ్రిల్ బూర్గంపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలోని వరద ప్రభావిత ప్రాంతంలో జరిగింది. ఇందులో ప్రజలను సురక్షితంగా రక్షించడం, లైఫ్ జాకెట్లు, బోట్లు ఉపయోగించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించడం, అవసరమైన వైద్య సేవలు, త్రాగునీరు, భోజనం, తాత్కాలిక నివాసం వంటి సేవలను డెమో రూపంలో ప్రదర్శించడం జరిగింది. వివిధ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేవలను బాధితులకు అందించడం, ఫైర్, ఇరిగేషన్, గజ యితగాళ్ల పాత్రను, వారు చేపట్టే అత్యవసర చర్యలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించడం జరిగింది. పునరావాస కేంద్రాల్లో బాధితులకు త్రాగునీరు, భోజనం, అత్యవసర వైద్య సేవలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలను డెమో రూపంలో చూపించారు. అలాగే, బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిబ్బంది (ఈయంసి) రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొని, బాధితులకు అవసరమైన ఏర్పాట్లు సహాయ సేవలను సమన్వయంతో అందించారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యవసర సమయంలో అప్రమత్తత ద్వారా నష్టాలను నివారించవచ్చని, యువత, విద్యార్థులు, శాఖల అధికారులు సమన్వయంతో చురుగ్గా పాల్గొనాలి అని చెప్పారు.ఎన్‌సిసి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, అత్యవసర పరిస్థితుల్లో వారు ఏ విధంగా స్పందించాలో, ఎలాంటి చర్యలు చేపడతారో తెలుసుకున్నారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితులలో సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేయగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు కీలకమని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, విపత్తుల సమయంలో అన్ని బృందాలు సమన్వయంతో పనిచేయాలి, ఆధ్యాత్మిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలి అని తెలిపారు. ప్రతి సంవత్సరం వరదలు సంభవించే బూర్గంపాడు లాంటి ప్రాంతాల్లో ఇటువంటి మాక్ డ్రిల్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో, అధికారుల్లో విశ్వాసం పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, పోలీస్ శాఖ సిబ్బంది, ఎన్ డి ఆర్ ఎఫ్ అధికారి,సీనయ్య, డిడిఆర్ఎఫ్ సిబ్బంది, ఎన్సిసి, ఫైర్, రెవెన్యూ, వైద్యశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మాటకు నిలబెట్టుకున్న ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నరసింహ

: **ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కోతుల బెడద నివారణకు రూ.1లక్ష విరాళం**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఇచ్చిన మాటకు ప్రకారం కోతుల బెడద నివారణకు ముందడుగు వేసి, మాటలు నిలబెట్టుకున్నారు ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నరసింహ. ప్రచారంలో భాగంగా గ్రామంలో గెలిచిన వెంటనే కోతుల బెడద నివారణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నరసింహ సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కోతుల బెడద నివారణకు హామీ ఇచ్చానని గుర్తు చేశారు. కోతుల బెడద నివారణలో భాగంగా తన సొంత నిధులు రూ.1లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జువ్వి నరసింహ మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా తాను ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తానన్నారు. మొదటగా గ్రామాన్ని కోతుల బెడద నుంచి పూర్తిగా సంరక్షించడానికి బాధ్యతగా తీసుకున్నానన్నారు.

# తుర్కపల్లి సర్పంచ్‌కు గ్రామస్తుల సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని తుర్కపల్లి గ్రామ నూతన సర్పంచ్ గా రోడ్డ భాగ్యమ్మ, బానయ్యను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ప్రమాణ స్వీకార మహోత్సవం అనంతరం వారికి శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గూడెపు వెంకటేష్, వార్డు మెంబర్లు, గ్రామస్తులున్నారు.

# చీకోడు సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని చీకోడు గ్రామ నూతన సర్పంచ్ బొమ్మని ఆంజనేయలు, ఉప సర్పంచ్




ఆశ రంజిత్, వార్డు మెంబర్లను మాజీ సర్పంచ్ చర్లపల్లి రజిత సుధాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారి పాలనలో గ్రామం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# సర్పంచుల ప్రమాణస్వీకారం





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సుజాతనగర్ మండలంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మండల పరిధిలోని వివిధ పంచాయతీ కేంద్రాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సింగభూపాలెం గ్రామపంచాయతీ కేంద్రంలో సర్పంచ్ గా ఎన్నికైన కిన్నెర వెంకన్న, ఉప సర్పంచ్ గోరింట్ల ధర్మరాజు ల తో పాటు వార్డు సభ్యులను సుజాతనగర్ మండల వ్యవసాయ అధికారి నర్మద ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి టిపిసిసి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు స్థానిక మండల కాంగ్రెస్ నాయకులు మండే వీర హనుమంతరావు, చింతలపూడి రాజశేఖర్, స్థానిక నాయకులు తిట్ల భాస్కరరావు, గ్రామపంచాయతీ సెక్రటరీ రహీం తదితరులు పాల్గొన్నారు

# ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి ప్రశాంతత లభిస్తుంది

* **కొలన్ శ్రీనివాస్ రెడ్డి**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆధ్యాత్మిక చింతన తోనే మనిషికి ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప శ్రీ శ్రీ శ్రీ ఉమామహేశ్వర స్వామి శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవస్థానముల చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దేవస్థానం అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు రాజీవ్ గృహకల్ప ఆలయ అభివృద్ధికి గాను రూ.50 వేల విరాళాన్ని అందజేయగా సోమవారం శ్రీ కొలన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు తగినట్టుగా ఆలయాల అభివృద్ధిలో తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు ఆలవాలం అని, అలాంటి ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా మరింత మందికి ప్రశాంతతను చేకూర్చిన వారమవుతారు. ఆ క్రమంలోనే నిజాంపేట తో పాటు మరికొంత ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధిలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. రాజీవ్ గృహకల్ప ఇల్లా సముదాయ నివాసితులతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఇక్కడి ఉమామహేశ్వర స్వామిని, నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధిలో పితాని శ్రీనివాసరావు తీసుకుంటున్న చొరవను ఆయన అభినందించారు. సొంత నిధులను వెచ్చించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు తో పాటు ముఖ్య సలహాదారుడు రామచంద్రనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, కమిటీ సభ్యుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఆస్తి పన్ను చెల్లింపుపై
# జీహెచ్ఎంసీ కీలక ప్రకటన

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొండి బకాయిలున్న ఆస్తి పన్నుల చెల్లింపుదారులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ ప్రకటించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపులో వడ్డీ రాయితీ ప్రకటిస్తూ ప్రవేశపెట్టిన వన్ టైమ్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి ఓటీఎస్ కింద మొండి బకాయిలన్నీ ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులను అమలు చేయాలని ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు.

## కమీషన్ల కోసం ప్రాజెక్టులు కట్టి..
# రూ. లక్షల కోట్ల అప్పులు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిజైన్ చేసి.. నిర్మించిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపి.. సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో వాడుకున్న నీరు 70, 80 టీఎంసీలే. రూ.1.80 లక్షల కోట్ల ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనత. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు



అనేది పదేళ్లకు అంగీకరించారు. పాలమూరు, ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ పూర్తి చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా? కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ. లక్షల కోట్లు అప్పులు చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నాం. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.5 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండా పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారు'' అని ఉత్తమ్ విమర్శించారు.

# 579 కిడ్నాప్‌లు.. 73 హత్యలు.. రాచకొండ పరిధిలో పెరిగిన నేరాలు..

హైదరాబాద్: రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. 2024లో 28,626 కేసులు నమోదు కాగా.. 2025లో ఈ సంఖ్య 33,040కు పెరిగింది. మహిళలపైనా గత ఏడాదితో పోలిస్తే 4 శాతం అధికంగా నేరాలు నమోదయ్యాయి. ''కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056 కేసులను (78 శాతం) పరిష్కరించాం. 12 కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలుశిక్ష పడేలా దర్యాప్తు చేశాం. అడ్డగూడూరు పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేశాం. 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశాం. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10 కోట్లను రిఫండ్ చేశాం. డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసి.. రూ.20 కోట్లు విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాం. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో 227 ఎన్డీపీఎస్ అనుమానిత షీట్లను తెరిచాం. నాన్‌బెయిలబుల్ వారెంట్ ఫ్రీ కమిషనరేట్‌గా రాచకొండను తీర్చిదిద్దాం'' అని రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు.



**వార్షిక నేర గణాంకాలు..**

* 579 కిడ్నాప్ కేసులు, 1224 పోక్సో కేసులు
* దోపిడి కేసులు 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీలు 589
* వాహనాల చోరీలు 876, సాధారణ చోరీలు 1,161
* హత్యలు 73, అత్యాచారాలు 330
* వరకట్నం మరణాలు 12, గృహ హింస కేసులు 782

# రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేసి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తాం

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేసి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను ఆయన సోమవారం జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ



ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలన్నారు. అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, పోశెట్టిగౌడ్, నాగరాజు, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దు: హరీశ్‌రావు

హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాల కోసం కోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆయన పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. ''బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించింది. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా కేసీఆర్




నిలిపారు. మూడురెట్ల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరిగింది. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని రేవంత్ ఆరోపించారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దని కోరుతున్నా. సొంత పార్టీ నేతలనే తొక్కుకుంటూ పెరిగినట్లు ఆయన స్వయంగా చెప్పారు. రూ.50కోట్లు పెట్టి రేవంత్ పీసీసీ పదవిని కొనుగోలు చేసినట్లు గతంలో కోమటిరెడ్డి చెప్పారు. నిజాయతీగా, త్యాగాల పునాదులపై ఎదిగిన నాయకత్వం మాది. ఎమ్మెల్యే, మంత్రి పదవులను గడ్డిపోచల్లా త్యాగాలు చేసిన చరిత్ర మా పార్టీ నేతలది'' అని హరీశ్‌రావు అన్నారు.



## రాయదుర్గం కో లివింగ్
# హాస్టల్‌లో డ్రగ్స్ దందా

హైదరాబాద్: రాయదుర్గం పరిధిలోని కో లివింగ్ హాస్టల్‌లో డ్రగ్స్ దందా మరోసారి వెలుగు చూసింది. స్థానిక అంజయ్య నగర్‌లోని కో లివ్ గెర్నట్ పీజీలో డ్రగ్స్ దందా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులు, డ్రగ్స్‌ను వినియోగిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 12 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల ఓజీ కుష్, 6 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సరఫరాదారులను ఏపీకి చెందిన డ్రగ్ పెడ్లర్లు వంశీ దిలీప్, బాల ప్రకాశ్‌గా, వినియోగదారులను హైదరాబాద్‌కు చెందిన మణికంత, రోహిత్, తరుణ్‌గా గుర్తించారు. వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించిన ఎస్‌వోటీ పోలీసులు.. నిందితులను రాయదుర్గం పోలీసులకు అప్పగించారు.

## బీఆర్ఎస్‌కు కండలు కరిగిపోయి
# తోలు మాత్రమే మిగిలింది: మంత్రి జూపల్లి

హైదరాబాద్: రెండేళ్ల తర్వాత అధికారంలోకి రాగానే తోలు తీస్తానని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెబుతున్నారని.. ఆ పార్టీకి కండలు కరిగిపోయి తోలు మాత్రమే మిగిలిఉందని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ బలహీనపడిందని.. పార్టీ ప్రతిష్ఠ కాపాడుకోవాలనే విషయం కేసీఆర్‌కు అర్థమైందని చెప్పారు. గాంధీభవన్‌లో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి జూపల్లి మీడియాతో మాట్లాడారు. ''పాలమూరు ప్రాజెక్టు సమస్య గురించి కాదు.. పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ బయటకు వచ్చారు. ఆ ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకుని పూర్తిచేస్తానని గతంలో ఆయన చెప్పారు. పదేళ్లు పాలించి.. రూ.8 లక్షల కోట్ల అప్పు చేసినా ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాన కాలువలు కూడా పూర్తిచేయలేదు. 2023 ఎన్నికల సమయంలో ఒక మోటార్ ఆన్‌చేసి పాలమూరు ప్రాజెక్టు జాతికి అంకితమన్నారు.




నీటి కేటాయింపులు, అనుమతులు లేకుండా ఆ పని చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే మరో రూ.40 నుండి 50వేల కోట్లు కావాలి. పర్యావరణ అనుమతులు తీసుకుంటే మన నీళ్లు మనం వాడుకునే పరిస్థితి ఉంటుంది. సాగుకు కాదు.. తాగునీటి కోసమని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పనులు మొదలుపెట్టవచ్చని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇరు రాష్ట్రాలకు కలిపి 811 టీఎంసీలు అని విభజన చట్టంలో ఉంది. నదీ పరివాహక ప్రాంతం ఉన్నంత మేరకు నీటి కేటాయింపులు జరగాలి. రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలు.. 512 టీఎంసీలు ఏపీ వాడుకోవాలని పదేళ్లు వదిలేశారు'' అని జూపల్లి విమర్శించారు.

**ఆ రెండు పార్టీలు కలిసి పనిచేశాయి**

పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్, భాజపా కలిసి పనిచేశాయని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆ రెండు పార్టీలు కలిసినా మూడింట ఒక వంతు సీట్లు కూడా వారికి రాలేదని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని ఇటీవల కేటీఆర్ చెప్పారని గుర్తుచేశారు. ప్రభుత్వంపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపణలు తప్పు అని ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు.

# కూరగాయల విస్తీర్ణం పెరగాలి: కోదండ రెడ్డి

రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణం పెరగాలి, రోజు రోజుకు తగ్గడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉందని రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డ కావడంతో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రైతులు కూరగాయల సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. సోమవారం ఉద్యాన సాగు పంటలపై కేరళలో చేసిన పర్యటన అక్కడ ఉన్న పరిస్థితులపై ఆశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైఎస్ హయాంలో కూరగాయల సాగు ప్రోత్సహించడానికి రంగారెడ్డి జిల్లాను హార్టికల్చర్ హబ్ గా ప్రకటించారని గుర్తు చేశారు. జిల్లాలోని యాచారం మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాల్లో కూరగాయల సాగు చేస్తున్నారని తెలిపారు. మధ్యదళారీ వ్యవస్థ లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని, కౌలు రైతు వ్యవస్థ కూడా చాలా కీలకమని ప్రైవేట్ అప్పులతో చాలామంది కౌలు రైతులు చనిపోతున్నారని కౌలు రైతు పాలసీ కేరళలో బాగుందన్నారు.

# విమానం ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకు.. గగనతలంలో ఎమర్జెన్సీ

గగనతలంలో ఎయిరిండియా విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైంది . సాంకేతికలోపం కారణంగా ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోయింది. దిల్లీ నుంచి ముంబయికి బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఈ లోపాన్ని గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 3.20 గంటల సమయంలో ఎయిరిండియా బోయింగ్ విమానం టేకాఫ్ అయింది. ఆ వెంటనే కుడివైపు ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ అసాధారణంగా




తగ్గిపోవడాన్ని పైలట్ గుర్తించారు. తర్వాత అది జీరోకు పడిపోయింది. దాంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. టేకాఫ్ అయినచోటే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది. భద్రతా ప్రోటోకాల్స్ ఆధారంగా విమాన సిబ్బంది నిర్ణయం తీసుకున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఆ విమానంలో సాంకేతికపరమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారులు వెల్లడించారు. ఈ ఊహించని పరిస్థితి వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. ప్రయాణికులు ముంబయి చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పింది. కొన్ని రోజుల క్రితం కూడా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తిన సంగతి తెలిసిందే. ఏపీలోని గన్నవరం నుంచి విశాఖ బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా నిలిచిపోయింది. అప్పుడు విమానంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు 163 మంది ప్రయాణికులు ఉన్నారు.



### తల్లీకుమార్తెలపై అత్యాచార ఘటన..

## నిందితులకు జీవిత ఖైదు..

దాదాపు పదేళ్ల క్రితం దేశంలో సంచలనం సృష్టించిన తల్లీకుమార్తెల అత్యాచార ఘటన లో సోమవారం తుది తీర్పు వెలువడింది. 2016లో బులంద్‌షహర్‌లో జరిగిన ఈ అమానవీయ ఘటనలో ఇప్పటికే ఐదుగురిని దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. జులై 28, 2016 రాత్రి సమయంలో దిల్లీ కాన్పూర్ హైవేపై కారులో వెళ్తున్న ఓ కుటుంబాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు అడ్డుకున్నారు. వారి దగ్గర ఉన్న ఇనుపరాడ్డులతో కారును ధ్వంసం చేసి.. కారులో ఉన్న వారిని బెదిరించి, నగదు దోచుకున్నారు. అనంతరం మిగిలిన కుటుంబసభ్యులను బంధించి తల్లి, ఆమె 14 ఏళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు తొలుత ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయగా వారికి ఎలాంటి సంబంధం లేదని దర్యాప్తులో తేలింది. ఈ కేసు అప్పట్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో తీవ్ర దుమారం రేపింది. దీంతో అలహాబాద్ హైకోర్టు ఈ కేసును సీబీఐ (CBI) కి అప్పగించింది. అనంతరం దర్యాప్తు చేపట్టగా.. బవేరియా ముఠాకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. రెండేళ్ల తర్వాత 2018లో నిందితులను అరెస్టు చేసి సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసు పెండింగ్‌లో ఉండగానే.. నిందితుల్లో ఒకరు కస్టడీలో మరణించాడు. కొన్నేళ్ల పాటు సాగిన ఈ విచారణ అనంతరం ఇటీవల పోక్సో కోర్టు ఈ కేసులో ఐదుగురిని దోషులు తేల్చింది. తాజాగా వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో డీఎన్ఏ కీలక సాక్ష్యంగా ఉన్నట్లు బాధితుల తరపు న్యాయవాది వెల్లడించారు. అత్యాచారానికి గురైన బాధితురాలి దుస్తులపై నిందితుల డీఎన్ఏ ఉన్నట్లు ఫోరెన్సిక్ దర్యాప్తులో తేలిందని తెలిపారు.



## సబర్మతి అప్పుడో లెక్క.. ఇప్పుడో లెక్క!

* **మురుగును కట్టడిచేసి.. జీవం పోసిన యంత్రాంగం**
* **ఆహ్లాదం.. వినోదానికి చిరునామాగా రివర్‌ఫ్రంట్**

నాడు: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని సబర్మతి నది ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురై, అడుగడుగునా ఆక్రమణలు, వ్యర్థాలతో అధ్వాన స్థితిలో కనిపించేది. పారిశ్రామిక వ్యర్థాలు భారీగా కలిసిపోయి తీవ్ర ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. వరదల కారణంగా నది కట్టలు కోతకు గురయ్యేవి.

నేడు: స్వచ్ఛమైన నదీతీరం, రెండు వైపులా పటిష్ఠ వరద రక్షణ గోడలు, గట్ల వెంబడి పరచుకున్న పచ్చదనం, అనేకచోట్ల జలసిరుల సోయగాలు, నదీతీరం వెంబడి సందడి చేసే వలస పక్షులు.. విద్యుత్తు దీపాల వెలుగుల్లో ఆకట్టుకొనే అటల్ వంతెన ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ప్రత్యేకతలున్నాయి.

### అధ్వానం నుంచి ఆహ్లాదంగా..

అధ్వాన స్థితి నుంచి అద్భుతమైన రీతిలో తీర్చిదిద్దడానికి అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాతికేళ్లుగా చేసిన కృషి కనిపిస్తోంది. సబర్మతి నది పునరుజ్జీవానికి కంకణం కట్టుకున్న అధికారులు 1997లో నదీ ముఖద్వార అభివృద్ధి సంస్థ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్ నగరం మధ్యలోంచి వెళుతున్న నదీ తీరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. రెండువైపులా గట్ల పరిరక్షణపై తొలుత దృష్టి పెట్టారు. 10 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నదీగర్భంలో డయాఫ్రమ్ గోడలు నిర్మించారు. ఆకస్మిక వరదల నుంచి లోతట్టు ప్రాంతాలను రక్షించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. నది ప్రవాహ మార్గానికి అనుగుణంగా 263 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. ఈ ప్రయత్నం వల్ల నగరంలోకి వరద వెళ్లకుండా అడ్డుకట్ట పడింది. నదిలో 4.75 లక్షల క్యూసెక్కుల నీరు కిందికి ప్రవహించేలా దోహదపడింది.

### పక్కాగా మురుగునీటి మళ్లింపు

మురుగునీరు నదిలోకి రాకుండా కట్టడి చేయడం, పారిశ్రామిక వ్యర్థాలు సబర్మతిలో పడకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. మురుగునీరు ప్రవహించే కాలువలను నదికి రెండు వైపులా ఉన్న కాలువలకు అనుసంధానం చేసి 38 పాయింట్లలో మురుగునీటిని సేకరించి వాస్నా బ్యారేజీకి దక్షిణంగా ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు తరలిస్తున్నారు. సబర్మతి నది వర్షాకాలంలోనే ప్రవహిస్తుంది. ఏడాది పొడవునా నదిలో నీటిని పారించటానికి ఒక సమగ్ర వ్యూహాన్ని రూపొందించారు. వాస్నా బ్యారేజీ కట్టి నీరు నిల్వ ఉండేలా చేశారు. అహ్మదాబాద్‌కు దిగువన ఉన్న వాస్నా బ్యారేజ్, నగరంలో నది పొడవునా మొత్తం 15 కిలోమీటర్ల మేర నీరు నిల్వ ఉంటూ జలసిరులతో అలరారుతోంది. నీటినిల్వతో వినోద కార్యకలాపాలకు వీలు కలగడమే కాకుండా, భూగర్భ జలాలు పెరుగుతున్నాయని అక్కడి అధికారులు వివరిస్తున్నారు.

### వినోదం.. వలస పక్షుల ఆవాసం

నదిలో చిన్నపాటి వ్యర్థానికి ఆస్కారం లేకుండా ఫ్లోటింగ్ ట్రాష్ స్కిమ్మర్ మెషిన్ ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. దీంతో ఎటుచూసినా సుందర దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. రెండువైపులా గట్ల వెంబడి విరివిగా మొక్కలు నాటడంతో పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అక్కడక్కడా బెంచీలు, వాకింగ్‌ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికుల రద్దీతో సందడి వాతావరణం నెలకొంటోంది. నదీతీరం నుంచి రోడ్డుకు మధ్యలో 20 మీటర్లకుపైగా వెడల్పు ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్ది, మొక్కలు పెంచి విద్యుత్తు దీపాలతో అలంకరించడంతో రాత్రివేళ అత్యంత సుందరంగా కనిపిస్తోంది. నదిపై నిర్మించిన అటల్ వంతెనపై వివిధ రంగులలో వెలిగే విద్యుత్తు దీపాలు, వంతెన ఆకృతి ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. అనేక రకాల వలస పక్షులకూ ఆవాస ప్రాంతమై జీవ వైవిధ్యానికి నెలవుగా తయారైంది.

### చెత్త కుప్పలో పిల్లాడికి దొరికిన ‘బొమ్మ’..

## అది చూసి అధికారులు షాక్..!

చెత్తకుప్పలో దొరికిన కొత్తతరహా బొమ్మ తీసుకొని ఓ పిల్లాడు సరదాగా ఆడుకుంటున్నాడు. కానీ ఆ వస్తువును చూసి పోలీసులు షాక్ అయ్యారు. అది కూడా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కార్యాలయం పక్కన దొరికిందని తెలిసి అప్రమత్తమయ్యారు. ఆ దగ్గర్లోనే పోలీసు విభాగానికి చెందిన సెక్యూరిటీ ఆఫీస్ కూడా ఉంది. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం సృష్టిస్తోంది. ఇంతకీ ఏం జరిగిందంటే..? జమ్ములోని సిద్రా ప్రాంతంలో జాతీయ దర్యాప్తు




సంస్థ కార్యాలయం పక్కన చెత్త కుప్పలో అసాల్ట్, స్నైపర్ రైఫిళ్లలో వాడే టెలిస్కోప్ ఒక పిల్లాడికి దొరికింది. అది ఒక బొమ్మగా భావించి అతడు ఆడుకుంటున్నాడు. అయితే ఆ విషయం పోలీసుల దృష్టికి చేరడంతో.. ఆ అనుమానాస్పద వస్తువును స్వాధీనం చేసుకున్నారు. అది చైనాలో తయారైందని గుర్తించడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అలాగే జమ్ము ప్రాంతంతో పాటు ప్రభుత్వ, సైనిక కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకావొద్దని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి 24 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన నేపథ్యంలోనే ఈ ఘటన వెలుగుచూసింది. ఈ సంస్థే ఇటీవల దిల్లీలో చోటుచేసుకున్న కారు బాంబు పేలుడుపై దర్యాప్తు చేస్తోంది.

## బంగ్లాదేశ్ అల్లర్ల వేళ.. మరో విద్యార్థి నాయకుడిపై కాల్పులు

ఢాకా: భారత వ్యతిరేకి, ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ మరో విద్యార్థి నాయకుడిపై హత్యాయత్నం జరగడం కలకలం రేపుతోంది. బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ సీనియర్ నేత మోతాలెబ్ సికదార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. సోమవారం ఉదయం ఖులానా పట్టణంలోని సికదార్ నివాసం వద్దే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో సికదార్ తల్లోకి తూటా దూసుకెళ్లడంతో ఎడమవైపు తీవ్ర గాయమైంది. అతడి మద్దతుదారులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలకు నేషనల్ సిటిజన్ పార్టీ సిద్ధమవుతోన్న వేళ.. ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఇదిలాఉండగా..




డిసెంబరు 12న ఉస్మాన్ హాదీ ఎన్నికల ప్రచారంలో ఉన్నప్పుడు దుండగులు అతడిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన హాదీ.. చికిత్స పొందుతూ గత గురువారం ప్రాణాలు కోల్పోయాడు. అతడి మరణంతో బంగ్లాదేశ్‌లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. హాదీ మద్దతుదారులు, విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు మీడియా కార్యాలయాలు, అవామీలీగ్ ఆఫీసులకు నిప్పు పెట్టారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

## ప్రేమతో నిండిన ప్రపంచాన్ని నిర్మిద్దాం: గురుదేవ్

బెంగళూరు: ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక ధ్యానానికి గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో 150 దేశాల నుంచి 12.1 మిలియన్ల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుదేవ్ మాట్లాడుతూ.. “మనలో ప్రతి ఒక్కరం ధ్యానానికి రాయబారిగా మారి, మరింత అందమైన, ప్రేమతో నిండిన ప్రపంచాన్ని నిర్మిద్దాం. చివరకి మనకు ఉన్నది ఇదొక్క గ్రహమే కదా” అని పేర్కొన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం.. సమాజంలో పెరుగుతోన్న ఒత్తిడి, ఘర్షణలు, మానసిక ఆరోగ్య సవాళ్ల మధ్య శాంతి, అంతర్గత బలాన్ని అన్వేషిస్తున్న ప్రపంచ ధోరణిని ప్రతిబింబించింది. బాల్య దశలో ప్రేమ, కరుణ, అవగాహన, ఏకాగ్రత వంటి గుణాలతో మనం సహజంగానే అనుసంధానమై ఉంటామని గురుదేవ్ వివరించారు. ఆ స్థితిలో ఉండకుండా మనల్ని అడ్డుకునే పరిస్థితులను వదిలేయడమే ధ్యానం అన్నారు. మానసిక శ్రేయస్సు, సామాజిక సమన్వయంలో ధ్యానం పాత్రను చాటిచెప్పేలా ఐరాస సాధారణ సభ 2024లో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని వార్షిక కార్యక్రమంగా ఆమోదించింది. ఈ ఏడాది వేడుకలు న్యూయార్క్ నగరంలోని ఐక్యరాజ్యసమితి ట్రస్టీషిప్ కౌన్సిల్‌లో జరిగాయి. అక్కడ దౌత్యవేత్తలు, ఉన్నతాధికారులు



గురుదేవ్ నేతృత్వంలో జరిగిన ప్రత్యక్ష ధ్యానంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి ఈ సాధన భారత్‌లోని పలు నగరాలు, గ్రామాల నుంచి ఆఫ్రికా, యూరప్, ఆసియా, అమెరికాలు, ఆస్ట్రేలియా వరకు ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ధ్యానం, ఊహ, విజువలైజేషన్ మధ్య తేడాను గురుదేవ్ స్పష్టంగా వివరించారు. “ధ్యానం పేరుతో మనం చాలా ఊహలు చేస్తుంటాం. అది మరింత శ్రమకు దారితీస్తుంది. చాలా యాప్‌లు ఊహించమంటాయి. కానీ, ఊహించడం ధ్యానం కాదు. దృష్టిని లోపలికి తీసుకురావడం సరే. కానీ ఉద్రిక్తత లేకుండా వదిలేయడమే అసలైన రహస్యం. ధ్యానం చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయి. కానీ, వాటి లక్ష్యం ఒక్కటే. నీకు నువ్వుగా ఉండటం. కేవలం ఉండటం మాత్రమే” అని గురుదేవ్ అన్నారు. అరవైకి పైగా దేశాల నుంచి విద్యార్థులు, రైతులు, ఖైదీలు వంటి విభిన్న వర్గాల ప్రజలను ఇది ఏకం చేసింది. ప్రపంచ ధ్యాన దినోత్సవానికి ముందుగా గ్యాలప్, ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కలిసి ప్రకటించిన ధ్యానం, వెల్‌బీయింగ్‌పై ప్రపంచంలోనే తొలిసారి నిర్వహిస్తున్న అధ్యయనం ఈ ఉద్యమానికి మరింత బలం చేకూర్చింది. ఈ సహకారంలో భాగంగా గ్యాలప్ వరల్డ్ పోల్‌లో ధ్యానానికి సంబంధించిన కొత్త ప్రశ్నలను చేర్చనుంది. దీని ద్వారా ధ్యానం భావోద్వేగ ఆరోగ్యం, జీవన మూల్యాంకనం, సామాజిక శ్రేయస్సుతో ఎలా సంబంధం కలిగి ఉందో డేటా ఆధారితంగా విశ్లేషించవచ్చు. గ్యాలప్ తాజా పరిశోధనల ప్రకారం.. ఒత్తిడి, ఆందోళన వంటి ప్రతికూల భావాలు ప్రపంచవ్యాప్తంగా ఇంకా అధిక స్థాయిలోనే ఉన్నాయి. ఇది మానసిక ఆరోగ్యానికి విస్తృతంగా అమలు చేయగల పరిష్కారాల అవసరాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ఐరాస వేదికపై గురుదేవ్ చెప్పినట్లుగా.. ‘ధ్యానం ఇక విలాసం కాదు; అది ఒక అవసరం’ అనే భావన ఇప్పుడు దౌత్య వేదికల నుంచి సామాన్య ప్రజల వరకు ప్రతిధ్వనిస్తోంది’. ఈ అధ్యయనానికి సంబంధించిన ప్రపంచ స్థాయి ఫలితాలు 2026 డిసెంబరులో వెలువడనున్నాయి.

### భారతీయులకు వీసా సర్వీసులను

## తాత్కాలికంగా నిలిపివేసిన బంగ్లాదేశ్

దిల్లీ: భారత్‌లో కాన్సులర్, వీసా సర్వీసు సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ ప్రకటించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకూ ఈ నిర్ణయం కొనసాగుతుందని తెలిపింది. బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. “అనివార్య కారణాల వల్ల దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ నుంచి అన్ని కాన్సులర్, వీసా సేవలు నిలిపివేస్తున్నాం. తదుపరి నోటీసులు వచ్చే వరకూ ఇవి కొనసాగుతాయి. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం” అని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో చత్రోగ్రామ్‌లోని ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్‌లో వీసా కార్యకలాపాలను భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.



## ఐఫోన్ తయారీ ప్లాంట్‌లో రికార్డు స్థాయిలో సిబ్బంది నియామకం..

# 80 శాతం మహిళలే..




**న్యూఢిల్లీ:** ఐఫోన్లు సహా వివిధ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు తయారు చేసే ప్రముఖ తైవాన్ సంస్థ ఫాక్స్‌కాన్ భారీగా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఏర్పాటు చేసిన తన కొత్త యూనిట్‌లో కేవలం 8-9 నెలల్లో దాదాపు 30,000 మంది కార్మికులను నియమించుకుంది. వీరిలో అత్యధికంగా మహిళలే ఉండటం విశేషం.

బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఫాక్స్‌కాన్ దేశంలోనే రెండో అతిపెద్ద ఐఫోన్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఫ్యాక్టరీలో ఏప్రిల్-మే నెలల్లో ఐఫోన్ 16 మోడల్‌ను ఉత్పత్తి చేయగా.. ఇప్పుడు ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ మోడల్స్ తయారీని ప్రారంభించారు. ఇక్కడ ఉత్పత్తి చేస్తోన్న ఐఫోన్లలో 80శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఫ్యాక్టరీలో ఇప్పుడు నియామకాలను భారీగా పెంచారు. మొత్తం సిబ్బందిలో 80 శాతం మంది మహిళలే ఉండటం విశేషం. ఇందులో పనిచేసే కార్మికులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తోంది సంస్థ. కార్మికులు నెలకు సగటున రూ.18 వేల జీతం పొందుతున్నారు.

వచ్చే ఏడాది నాటికి ఈ యూనిట్‌లో మొత్తం సిబ్బందిని 50 వేలకు పెంచాలని ఫాక్స్‌కాన్ భావిస్తోంది. ఇక కార్మికుల కోసం సంస్థ ప్లాంట్ ప్రాంగణంలోనే అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. కార్మికుల కోసం ఆరు పెద్ద డార్మిటరీలను నిర్మించింది. అదనపు సౌకర్యాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. కేవలం ఫ్యాక్టరీగానే కాకుండా ఈ ప్లాంట్ భవిష్యత్తులో ఒక మినీ టౌన్‌షిప్‌లా మారనుందని అంచనా. ఇందులో నివాస సముదాయాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, వినోద సౌకర్యాలను అభివృద్ధి చేసేలా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

## ఆధార్‌తో చెల్లింపులు... సంక్షేమ పథకాల దుర్వినియోగానికి అడ్డుకట్ట!

ఆధార్ అనుసంధానంతో 12.7 శాతం తగ్గిన సంక్షేమ నిధుల దుర్వినియోగం

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.47 లక్షల కోట్లకు పైగా చెల్లింపులు

2.12 కోట్ల బోగస్ రేషన్ కార్డులను తొలగించిన రాష్ట్రాలు

మరణించిన వారి 2 కోట్ల ఆధార్ నంబర్లను రద్దు చేసిన యూఐడీఏఐ

డీబీటీ విధానంలో లోపాలున్నాయని గుర్తించిన కాగ్ నివేదిక



**న్యూఢిల్లీ:** దేశంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానం సంక్షేమ పథకాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విధానం వల్ల నిధుల దుర్వినియోగం 12.7 శాతం మేర తగ్గింది. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) వ్యవస్థను ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలను అందించగలుగుతోంది.

ఇప్పటివరకు డీబీటీ ద్వారా రూ.47 లక్షల కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ ప్రక్రియ వల్ల నకిలీ, అనర్హుల ఏరివేత సులభమైంది. ముఖ్యంగా, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద వివిధ రాష్ట్రాలు సుమారు 2.12 కోట్ల బోగస్ రేషన్ కార్డు లబ్ధిదారులను తొలగించాయి. దీంతో పాటు, భారత విశిష్ట ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కూడా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కీలక చర్యలు చేపట్టింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఖీఉఎ) నుంచి సమాచారం సేకరించి, మరణించిన వారి 2 కోట్లకు పైగా ఆధార్ నంబర్లను శాశ్వతంగా డీయాక్టివేట్ చేసింది. ఒకసారి రద్దు చేసిన ఆధార్ నంబర్‌ను మరెవరికీ కేటాయించబోమని యూఐడీఏఐ స్పష్టం చేసింది.

అయితే, డీబీటీ విధానంలో కొన్ని లోపాలు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికలో వెల్లడించింది. డేటా అనుసంధానంలో బలహీనతల కారణంగా సరైన తనిఖీలు లేకుండానే కోట్లాది రూపాయలు పంపిణీ అయ్యాయని తెలిపింది.

మరోవైపు, ఆధార్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. 2025 నవంబర్ నెలలో 231 కోట్ల ఆధార్ ఆధారిత లావాదేవీలు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే 8.47 శాతం ఎక్కువ. ఫేస్ అథెంటికేషన్, ఈ-కేవైసీ వంటి సేవలు ఈ వృద్ధికి దోహదపడుతున్నాయి. ఈ విధానాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, సంక్షేమ ఫలాల పంపిణీకి మద్దతుగా నిలుస్తున్నాయి.

## స్టాక్ మార్కెట్లలో కొనసాగిన బుల్ రన్...

భారీ లాభాల్లో సూచీలు

సోమవారం భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

638 పాయింట్లు పెరిగి 85,567 వద్ద ముగిసిన సెన్సెక్స్

ఐటీ, మెటల్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు

మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా లాభాల్లో పయనం



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ, గత సెషన్‌లో కనిపించిన సానుకూలతను కొనసాగించాయి. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), మెటల్ రంగాల షేర్లలో పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరగడం సూచీల పెరుగుదలకు దోహదపడింది. భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సానుకూల అంచనాలు కూడా మదుపరుల సెంటిమెంట్‌ను బలపరిచాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 638.12 పాయింట్లు లాభపడి 85,567.48 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 195.20 పాయింట్లు పెరిగి 26,161.60 వద్ద ముగిసింది. మార్కెట్లలోని ఈ ర్యాలీలో బ్రాడర్ మార్కెట్లు కూడా పాలుపంచుకున్నాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.17 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.84 శాతం చొప్పున లాభపడ్డాయి.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.06 శాతం వృద్ధితో టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ కూడా 1.41 శాతం లాభపడింది. అయితే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సెక్టార్ మాత్రం 0.16 శాతం స్వల్ప నష్టంతో ముగిసింది.

# ఆస్ట్రేలియాలో అంత ఈజీ కాదు..

## ఇంగ్లాండ్‌పై రోహిత్ వ్యంగ్యాస్త్రాలు



న్యూఢిల్లీ: ప్రస్తుతం జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ పేలవ ప్రదర్శన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లాండ్ ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లిష్ జట్టు వరుసగా నాలుగోసారి సిరీస్‌ను కోల్పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ టీమ్‌పై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. గురుగ్రామ్‌లో జరిగిన మాస్టర్స్ యూనియన్ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన 'హిట్‌మ్యాన్' విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన క్రికెట్ కెరీర్‌లో మరపురాని విజయాలను గుర్తుచేసుకున్నాడు. 2021లో గబ్బా టెస్టులో భారత్ చారిత్రాత్మక విజయాన్ని ప్రస్తావిస్తూ.. 'ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలవడం అంత ఈజీ కాదు.. కావాలంటే ఇంగ్లాండ్ ఆటగాళ్లను అడగండి చెబుతారు' అంటూ రోహిత్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. 'ఆస్ట్రేలియాలో 2021లో గబ్బాలో జరిగిన మ్యాచ్‌లో మేం (భారత్) గెలిచాం. రిషభ్ పంత్ అద్భుతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. మేం గెలుస్తామని ఎవరూ నమ్మలేదు. అలాంటి స్థితి నుంచి టీమ్‌ఇండియా పుంజుకుని గెలిచింది. ఆ మ్యాచ్‌లో మా ఫస్ట్ ఛాయిస్ ఆటగాళ్లందరూ గాయాలు, వివిధ కారణాల వల్ల అందుబాటులో లేరు. ఆ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ కొన్ని కామెంట్స్ చేయడం నాకు ఇంకా గుర్తుంది.

ఆ కామెంట్స్‌లో ఒకటి మమ్మల్ని ఆలోచనలో పడేసింది. మ్యాచ్ ప్రారంభమైనప్పుడు తుది జట్టులో ముగ్గురు అరంగేట్ర ఆటగాళ్లున్నారు. గబ్బా ఆస్ట్రేలియాకు కంచుకోట. అప్పటివరకు వారికి అక్కడ ఓటమి అనేదే తెలీదు. కానీ, గెలుపుపై ఆశలు లేని స్థితి నుంచి మేం గొప్పగా పుంజుకుని ఆ మ్యాచ్ గెలిపించాం. అయితే, టెస్ట్ క్రికెట్ ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఇందులో ఆడటం అంత సులభం కాదు. ఆస్ట్రేలియాలో ఆడటం కఠినమైన సవాలు. కావాలంటే మీరు ఇంగ్లాండ్ ఆటగాళ్లను అడగండి. గబ్బాలో విజయం సాధించి ఆ తర్వాత ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడం మాకు గ్రేట్ అచీవ్‌మెంట్' అని రోహిత్ పేర్కొన్నాడు.

### విజయ్ హజారే ట్రోఫీలో
## ఆడనున్న గిల్, అభిషేక్, అర్ష్‌దీప్




**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ డిసెంబరు 24 నుంచి మొదలుకానుంది. ఈ టోర్నీ కోసం పంజాబ్ 18 మందితో జట్టును ప్రకటించింది. టీమ్‌ఇండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మలకు ఇందులో అవకాశం కల్పించారు. వికెట్ కీపర్, బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో పాటు ఆల్‌రౌండర్లు నమన్ ధీర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, సన్వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, కెప్టెన్ ఎవరనేది మాత్రం వెల్లడించలేదు.

పంజాబ్ తమ ఏడు లీగ్ దశ మ్యాచ్‌లను జైపూర్‌లో ఆడనుంది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, గోవా, ముంబయితో తలపడనుంది. ఈ మ్యాచ్‌లు జనవరి 8న ముగుస్తాయి. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌లో గిల్, అభిషేక్, అర్ష్‌దీప్ ఎంపికైతే.. విజయ్ హజారే ట్రోఫీకి వారు ఎన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారో చూడాలి.

విజయ్ హజారే ట్రోఫీకి పంజాబ్ జట్టు: శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్‌కీపర్), హర్నూర్ పన్ను, అన్మోల్‌ప్రీత్ సింగ్, ఉదయ్ సహారాన్, నమన్ ధీర్, సలీల్ అరోరా, సన్వీర్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, జషన్‌ప్రీత్ సింగ్, గుర్నూర్ బ్రార్, హర్‌ప్రీత్ బ్రార్, రఘు శర్మ, క్రిష్ భగత్, గౌరవ్ చౌదరి, సుఖదీప్ బజ్వా.

### సూపర్బ్ సెలక్షన్.. శుభ్‌మన్ గిల్‌ను తొలగిస్తారని
## ఊహించలేదు: భారత మాజీ కెప్టెన్



**న్యూఢిల్లీ:** మొన్నటివరకు పొట్టి ఫార్మాట్‌లో టీమ్‌ఇండియాకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌ను 2026 టీ20 ప్రపంచకప్‌నకు పక్కన పెట్టడంతో షాక్ అయ్యానని భారత మాజీ కెప్టెన్, చీఫ్ సెలక్టర్ క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ప్రస్తుత సెలక్షన్ కమిటీ ఇంతటి కఠిన నిర్ణయం తీసుకుంటుందని తాను ఊహించలేదన్నాడు. అదే సమయంలో ప్రపంచ కప్‌నకు ఎంపిక చేసిన జట్టు అద్భుతంగా ఉందని కితాబిచ్చాడు.

'నేను ఆశ్చర్యపోయా. ఇది అద్భుతమైన సెలక్షన్. శుభ్‌మన్ గిల్(రాష్ట్రబీఎజీని ఉ తిశ్రీశ్రీ)ను తొలగిస్తారని నేను ఊహించలేదు. తొలుత అతనిని వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఆస్ట్రేలియా పర్యటనలో కూడా గిల్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. వన్డేల్లో శుభ్‌మన్ గిల్ గొప్ప ఆటగాడు. టెస్టుల విషయానికొస్తే.. ఇంగ్లాండ్‌లో భారీగా పరుగులు చేశాడు. కానీ, టీ20ల్లో ఇబ్బందిపడుతున్నాడు. ఇషాన్ కిషన్ లేదా మరెవరితోనైనా పోలిస్తే గిల్ స్ట్రైక్‌రేట్ చాలా తక్కువ. దేశవాళీలో అదరగొట్టిన ఇషాన్‌ను ఎంపిక చేయడం మంచి విషయం. రింకు సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. మొత్తంమీద సెలక్షన్ కమిటీ అద్భుతమైన టీమ్‌ను ఎంపిక చేసింది. అభిషేక్ శర్మ, సంజుశాంసన్ ఓపెనింగ్ చేస్తారు. అభిషేక్ ప్రస్తుతం ప్రపంచంలోనే నంబర్ వన్ బ్యాటర్' అని క్రిస్ శ్రీకాంత్ అన్నాడు.

ఈ ఏడాది టెస్టు, వన్డే కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన గిల్.. ఆసియా కప్‌తో తిరిగి టీ20ల్లోకి పునరాగమనం చేశాడు. అంతేకాకుండా పొట్టి ఫార్మాట్‌లో అతడికి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో భవిష్యత్ సారథి అతడేనని అంతా ఫిక్సయ్యారు. కానీ, అంచనాలకు తగ్గట్లు రాణించలేదు. 15 మ్యాచ్‌ల్లో 291 పరుగులే చేశాడు. అందువల్లే గిల్‌ను టీ20 ప్రపంచకప్‌నకు ఎంపిక చేయలేదని క్రికెట్ పండితుల అభిప్రాయం. ఫిబ్రవరి 27 నుంచి పొట్టి ప్రపంచకప్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.

# స్నికోమీటర్ చిరాకు తెప్పిస్తోంది..

డీఆర్ఎస్ లోపాల్ని వెంటనే సరిచేయండి..!

**న్యూఢిల్లీ:** ఈమధ్య కాలంలో డీఆర్ఎస్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా యాషెస్ సిరీస్ మూడో టెస్టులోనూ డీఆర్ఎస్‌లోని స్నికోమీటర్ లోపాలు స్పష్టంగా కనిపించాయి. అడిలైడ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండు సందర్భాల్లో అంపైర్ నిర్ణయాన్ని సవాల్ చేయగా ఆతిథ్య జట్టుకే అనుకూలంగా నిర్ణయం వచ్చింది. దాంతో.. ఇంగ్లండ్ ఆటగాళ్లు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ ఐసీసీకి కీలక విజ్ఞప్తి చేశాడు. డీఆర్ఎస్ వ్యవస్థలోని లోపాలను సరి చేయాలని అంతర్జాతీయ క్రికెట్ మండలిని కోరాడు.

'డిసిషన్ రివ్యూ సిస్టమ్ అనేది లోపభూయిష్టంగా ఉంది. ప్రేక్షకులకు, అధికారులకు, బ్రాడ్‌కాస్టర్లకు ఈ నియమం చిరాకు తెప్పిస్తోంది. డీఆర్ఎస్‌పై నా అభిప్రాయం చెప్పదలచుకున్నాను. ఈ వ్యవస్థను మ్యాచ్ అధికారులు ఉపయోగిస్తారు. అలాంటప్పుడు ఐసీసీ ఎందుకు డబ్బులు చెల్లించాలి. అన్ని బోర్డులకు ఒక్కరే ఈ సిస్టమ్‌ను ఎందుకు అందించడం లేదు. ఐసీసీ టోర్నీలతో పాటు అన్ని సిరీస్‌లకు ఒకేరకమైన సాంకేతికతను ఎందుకు ఉపయోగించడం లేదు.

ఒకవేళ అన్నింటా ఒకే టెక్నాలజీ ఉపయోగిస్తే గందరగోళం తగ్గుతుంది. అంతేకాదు ఎవరికీ చిరాకు పడరు అని ఐసీసీకి స్టార్క్ విన్నవించాడు. ఏకీకృత వ్యవస్థను తీసుకురావాలని సూచించాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇకనైనా ఐసీసీ ఉత్తమమైన డీఆర్ఎస్ వ్యవస్థను తీసుకురావాలి' అని వాన్ సూచించాడు.





తొలి ఇన్నింగ్స్‌లో అలెక్స్ క్యారీని అంపైర్ ఔటిచ్చాడు. అయితే.. రివ్యూ తీసుకొని బతికిపోయిన ఆసీస్ వికెట్ కీపర్ ఏకంగా సెంచరీతో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లోనూ డీఆర్ఎస్ నిర్ణయం ఆసీస్‌కు అనుకూలంగా వచ్చింది. బ్యాట్, బంతి మధ్య దూరం ఉన్నట్టు కనిపిస్తున్నా సరే స్నికోమీటర్ మాత్రం బంతి ఎడ్జ్ తీసుకున్నట్టు చూపించింది. దాంతో.. ఇంగ్లండ్ బ్యాటర్ నిరాశగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో 81 పరుగుల తేడాతో గెలుపొందిన ఆతిథ్య జట్టు 3-0తో సిరీస్ పట్టేసింది.

MOVIE TIME

# రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం

## మరోమారు విడుదలైన పడియప్ప

## థియేటర్‌కు వెళ్లి చూసి థ్రిల్ అయిన రమ్యకృష్ణ



**టాకీస్:** తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్‌లోనే ఎవర్ గ్రీన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'పడయప్ప' తెలుగులో 'నరసింహ'మరోసారి ప్రేక్షకులను అలరిస్తోంది. రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 12న థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. 1999లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది. రజనీకాంత్ సరసన సౌందర్య, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ముఖ్యంగా నీలాంబరి పాత్ర సినీ చరిత్రలో నిలిచిపోయింది. ఆ పాత్రకు ప్రాణం పోసిన రమ్యకృష్ణ నటన ఇప్పటికీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. రీ రిలీజ్ సందర్భంగా తాజాగా రమ్యకృష్ణ స్వయంగా థియేటర్లో 'పడయప్ప'ను వీక్షించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ 'ఫస్ట్ టైమ్ 'పడయప్ప' మూవీని థియేటర్లో చూశాను' అని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# 24న మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల




**టాకీస్:** కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతున్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు.



# సమంతకూ తప్పని అభిమానుల తాకిడి

టాకీస్: కాలం మారినా కొందరి ప్రవర్తన మాత్రం మారడం లేదన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. ఇటీవల వరుసగా జరుగుతున్న కొన్ని ఘటనలు, సమాజంలో కొంతమంది ఎలా ప్రవర్తిస్తున్నారనే అంశంపై తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తాజాగా అగ్ర కథానాయిక సమంత రూత్ ప్రభుకు హైదరాబాద్‌లో ఎదురైన అనుభవం ఇందుకు ఉదాహరణగా మారింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిరిమల్లె శారీస్ షోరూమ్ ప్రారంభోత్సవానికి సమంత హాజరయ్యారు. ఆమెను ప్రత్యక్షంగా చూడాలనే ఉత్సాహంతో అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సమంత బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా జనం చుట్టుముట్టారు. సెల్ఫీల కోసం ఎగబడుతూ తోపులాటకు దిగారు. కొందరు అత్యుత్సాహంతో ఆమె ముఖానికి దగ్గరగా ఫోన్లు పెట్టి ఇబ్బంది పెట్టడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. రద్దీని నియంత్రించడం కష్టంగా మారడంతో సమంత కారు వరకు చేరుకోవడమే కష్టసాధ్యమైంది. వ్యక్తిగత భద్రతా సిబ్బంది తీవ్ర ప్రయత్నాల తర్వాత ఆమెను జనం నుంచి తప్పించి కారులో పంపించారు. ఈ గందరగోళ పరిస్థితుల్లోనూ సమంత సహనం కోల్పోకుండా చిరునవ్వుతోనే అక్కడి నుంచి వెళ్లడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇదే తరహా ఘటన వారం రోజుల క్రితం కూడా చోటుచేసుకుంది. కూకట్‌పల్లిలోని లులు మాల్‌లో జరిగిన ప్రభాస్ సినిమా 'ది రాజా సాబ్' పాట విడుదల కార్యక్రమంలో నటి నిధి అగర్వాల్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. అభిమానులు వేల సంఖ్యలో తరలిరావడంతో తొక్కిసలాట వాతావరణం నెలకొంది. ఆ సమయంలో నిధి అగర్వాల్ పట్ల కొందరు అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు సీరియస్‌గా స్పందించి, అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించారని, సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని లులు మాల్ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకులపై సుమోటోగా కేసు నమోదు చేశారు. వరుసగా ఇలాంటి ఘటనలు జరగడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పట్ల అభిమానం ఉండొచ్చు కానీ, కనీస మర్యాద లేకుండా ప్రవర్తించడం సరికాదని విమర్శిస్తున్నారు. దక్షిణాదిలో అభిమానం హద్దులు దాటుతోందని, కొందరు అనాగరికంగా ప్రవర్తిసున్నారని సోషల్ మీడియాలో కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి.

# నార్త్‌లో అఖండ-2 విడుదల

## హిందీ ఆడియన్స్ స్పందన అంతంత మాత్రమే



**టాకీస్:** టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నటసింహం నందమూరి బాలకృష్ణలకు తెలుగులో ఉన్న స్టార్‌డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆరు పదుల వయసులోనూ తమదైన శైలితో ప్రేక్షకులను మెప్పిస్తూ, యంగ్ హీరోలకు గట్టి పోటీ ఇస్తూ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. తెలుగులో వీరిద్దరికీ అశేషమైన అభిమాన గణం ఉండటంతో పాటు భారీ మార్కెట్ కూడా ఉంది. అయితే నార్త్ మార్కెట్ విషయానికి వస్తే చిరంజీవి, బాలకృష్ణలకు ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కడం లేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి స్వాతంత్ర్య పోరాట యోధుడి కథతో తెరకెక్కిన 'సైరా నరసింహా రెడ్డి' సినిమాతో నార్త్ ఆడియన్స్‌ను టార్గెట్ చేశారు. భారీ బ్జడెట్, పాన్ ఇండియా రిలీజ్, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటించడం వంటి అంశాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. కానీ హిందీలో పెద్ద ఎత్తున రిలీజ్ చేసినప్పటికీ, సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. వసూళ్లు పరిమితంగానే నమోదయ్యాయి. ఆ తర్వాత మలయాళ సూపర్ హిట్ 'లూసిఫర్' రీమేక్‌గా తెరకెక్కిన 'గాడ్ ఫాదర్' తో మరోసారి చిరంజీవి నార్త్ మార్కెట్‌లో తన అదృష్టాన్ని పరీక్షించారు. రాజకీయ నేపథ్యం, పవర్‌ఫుల్ పాత్ర ఉన్నప్పటికీ ఈ సినిమా కూడా హిందీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇదే సమయంలో నటసింహం బాలకృష్ణ కెరీర్‌లో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'అఖండ' సినిమాతో నార్త్ ఆడియన్స్ దృష్టిని ఆకర్షించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులోనే కాదు, హిందీ డబ్బింగ్ వెర్షన్‌కి కూడా యూట్యూబ్, టీవీ ప్రసారాల ద్వారా మంచి ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో 'అఖండ 2: తాండవం' పై హిందీలో కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సీక్వెల్ నార్త్ మార్కెట్‌లో క్లిక్ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ రిలీజ్ తర్వాత

పరిస్థితి భిన్నంగా మారింది. హిందీ వెర్షన్‌కు థియేటర్లలో స్పందన నెమ్మదిగా ఉండటంతో వసూళ్లు నిరాశపరిచినట్లు సమాచారం. ఇప్పటివరకు కలెక్షన్లు కోటి రూపాయల మార్క్‌ను కూడా దాటలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో చిరంజీవి హిందీ సినిమాల కంటే బాలకృష్ణ సినిమా మరింత తక్కువ వసూళ్లు సాధించిందన్న చర్చ మొదలైంది.

# అనిల్ రావిపూడి అదుర్స్

## ఏఐతో ప్రచార వీడియో వైరల్




**టాకీస్:** సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న వైఖరి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తనదైన పంథాలో కొత్త ఐడియాలను అప్లై చేస్తూ, ప్రతి సినిమాను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో అనిల్ దిట్ట. ప్రస్తుతం ఆయన మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' విషయంలో కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలు రిలీజ్ చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు అనిల్. సినిమాతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా అనిల్ రావిపూడి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని కూడా తన సినిమా ప్రమోషన్స్ కోసం వినియోగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి? ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు' అంటూ అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ సినిమాలు.. ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోక సుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్ దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి చిత్రాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ వీడియోను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. వింటేజ్ చిరుని పరిచయం చేస్తూ రూపొందించిన ఈ వీడియో మెగా అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తోంది. నెట్టింట ఈ వీడియోకు భారీ స్పందన వస్తుండగా, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది నెటిజన్లు మాత్రం 'అనిల్ ప్రమోషన్ స్ట్రాటజీ మామూలుగా లేదు? సినిమా కోసం ఏదీ వదలడం లేదుగా' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, 2025 సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి, 2026 సంక్రాంతికి కూడా అదే ఫీట్‌ను రిపీట్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు.

# దేశభక్తి ఒక్కటే కాదు..కథాబలం కూడా ముఖ్యం

## ఛావా విజయంపై నటుడు విక్కీ కౌశల్



**టాకీస్:** 'ఛావా', 'ధురంధర్'.. ఈ రెండు సినిమాలు ఊహించని స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ సినిమాల విజయానికి ప్రధాన కారణం వీటి నేపథ్యం మాత్రమేనని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ రెండూ దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కడం వల్లే విజయం సాధించాయంటూ వస్తోన్న కామెంట్స్‌పై విక్కీ కౌశల్ స్పందించారు. అలా అనడం సరికాదని.. నేపథ్యంతో పాటు వీటిలో ఎన్నో ఎమోషనల్ సన్నివేశాలు ఉన్నాయని అన్నారు. 'దేశభక్తి.. సినిమా విజయాలకు ఇది ఒక ఫార్ములా కాదు. అలా చెబితే అవమానించడమే అవుతుంది. దేశభక్తి నిర్వచించలేని ఓ అనుభూతి. దాన్ని మన సినిమాలు, సాహిత్యం, క్రీడలతో నిరంతరం చాటుకుంటూనే ఉండాలి. దేశంపై మనకున్న గౌరవం, ప్రేమకు నిదర్శనమే ఇలాంటి చిత్రాలు. మన దేశం గొప్పతనాన్ని ప్రపంచం ముందు చాటిచెప్పడానికి ఇదో మార్గం. 'ఛావా' లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు నాకెంతో గర్వంగా, ఆనందంగా ఉంది' అని విక్కీ కౌశల్ అన్నారు. శంభాజీ మహారాజ్ వీరగాథగా విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఛావా' లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ ఫిల్మ్ ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.807 కోట్లు వసూలు చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.